"ఈ మందులు సంగతలా వుంచండి. ఫీడ్ ది కోల్డ్ అండ్ స్టార్వ్ ది ఫీవర్" అంటారు అన్నాడు.

ఇన్నాళ్ళూ చెప్పేవే కాదేఁవిఁటి? నాక్కొంచెం జ్వరం వుంద నుకొ. దానికి ఉపవాసం పెడతాను రాత్రి అని సుష్టు పూర్తిగా రొంపకి భోజనం పెట్టేరు. పెరుగూ అన్నం తిన్న పడిశం పెరిగింది. ఉపవాసం వుండబోయే జ్వరం కూడా పెరిగింది.

"స్టార్వేషన్ ఈజ్ ది బెస్ట్ డయట్ అని చేప విషయంలోనే అన్నారనుకున్నాను. జ్వరాని క్కూడా వర్తిస్తుందన్నమాట" ఆశ్చర్య పోయేరు ఆయన.

ఇంతకీ అసలు విషయం, బాత్‌రూమ్‌లో ఆయన తుమ్మేరు. తుమ్మేక వార్ క్లౌడ్‌లా డైనింగ్ హాల్లోకి వచ్చి "ఆయనేరీ? ఎప్పు డొచ్చేరు మీరు? ఒకసారి నా రూమ్‌లోకి రా" అని గీతతోనూ, నాతోనూ ఒక్క గుక్కలోనే మాట్టాడి జవాబు అక్కర్లేనట్లు తన గదిలో పరిగెత్తారు. నేను వెళ్ళేసరికి పక్కమీద బోర్లా పడు కున్నారు. చెప్పొద్దూ, ఎంత మొగుడైనప్పటికీ నాకు నిజంగానే జాలేసింది. ఎంతటి మనిషి ఎలా అయిపోయేరు కడవంత గుమ్మడికాయి కత్తిపీటకు లోకువ – అన్నట్టు.

నేనేం. అతి తెలివైనదాన్ని కాను. కాని ఆయనతో ఎప్పుడు మాట్లాడ కూడదో మాత్రం బాగాతెలుసు అందచేత వెళ్ళి మంచం పక్కన మాట్లాడకుండా నిలుచున్నాను.

"వచ్చేవా!" అన్నారు వీలైనంత శాంతంగా.

"ఆఁ" అన్నాను

"చూడూ, నాకు రొంప వచ్చేసింది. గీత బహుశా నాలుగు రోజులుంటారు. ఈ రొంప వారం వుంటుంది. మరంచేత ఈ నాలుగు రోజులూ నువ్వు నాకు కనిపిస్తే బహుశా చంపక మానను, చంపడానికి మొహమాట పడితే కురుక్షేత్రం తప్పదు. మరంచేత కాఫీ వగైరాలన్నీ నా గదిలోకే పంపించీ, వింటున్నావా?" అన్నారు.

"ఊఁ"

"ఇప్పుడు దయచేసి గెటవుట్" అని గట్టిగా అరిచారు. ఆ అరుపుకి గోడనున్న ఫోటో ఒకటి కిందపడి భళ్ళుమంది. నేను గబగబా బైటికి పోయి తలుపులు ధామ్మని వేశేసేను.

ఈ గెటవుటూ, భళ్ళుమ్మన్న శబ్దం విన్న గీత భయపడిపోయి "ఏవైంది?" అంది, ఏవౌతుంది?

ఇంక ఆపేస్తాను. ఎంచేతంటే మావారు ఇప్పుడే తుమ్మేరు.

**(1975)**

# డబ్బు-1

**"సే**తా వాతాగాని మొగుడు మంచంనిండా ఉన్నాడని బెంచీకి సరిపడా ఒక్కడివే కూకున్నావు. కసింత సరకాయించు బాబురే" అంటూ అతను బెంచీమీద కూర్చున్నాడు.

"ఏంటి మాఁవాఁ..." పక్కవాడు ఏదో అనబోయేడు.

"అమ్మ పేరెట్టుకోడానికని ఒక్కర్తిని కనడానికేయిన్ని పాట్లు పడుతున్నాను. యింక నీకు మాఁవఁనవడానికి మరోర్తిని కనాలా? సాలొల్లకో..."

"యిప్పుడు నువ్వు కంటే మాత్తరం ఎపుడు జేసు కుంటాడులే?"

"నాను పుట్టకపోతే నువ్వెవర్ని కట్టుకునివోడివని పెళ్ళావఁ డిగితే నీ యమ్మని అన్నాట్ల ఎనకటికి నీలాటోడే. ఇప్పుడు కనాలేగాని నువ్వు గాకపోతే నీ బాబులాటోళ్ళు పది మంది దొరుకుతారు నా కూతిరికి. యీ వొయినులో కనాలేగాని ఎండి కడ్డీలాటిది వుట్టదూ? ఇంతకీ ఇప్పుడవన్నీ ఎందుకులే..."

"ఏటి మావాఁ అప్పుడే అంత ముసిలోడీవైపోనానంటావేఁ టి?"

"నా ననకపోతే కానేటి? మొన్న నా వయసోడే మా వూరోడు అగపడ్డాడు. అగుపడి ఆ వూసూ ఈ వూసూ ఆడి ఆస్పత్రి కెళతానని తెగిసాడు. పిప్పళ్ల బస్తాలాగున్నావు. ఆసుపత్రి కేలొరే అన్నాను. "ఏటి చెప్మంటావు? రేత్రి మా ఆదది.." అన్నాడు. బొడ్డూడని వెధవలు మీ కెందుకొరే ఈ కబుర్లన్నీని... కాస్త ఒటేలు ప్రొప్రైట్రు బాబుని పిలు బల్లక్లీన్ సెయ్యమనాలి".

"పళ్లూడిపోయినా పోనిది, పళ్ళన్నీ రాకముందు వుడితే తప్పా?" మీసం వస్తున్న వాడొకడడిగాడు.

"నిజమేనొరే. ముందటేడు గుంటూరు కెళ్ళినప్పుడు సివం చెలంగోడు కనిపించి" ఊళ్లోకి నరసమ్మ వచ్చిందిట. నా నెళ్ళి సూసొస్తాను కాస్త టాక్సీకాడనిలబడు. బేరం పోద్దో ఏటో అన్నాడు.

"నరసమ్మెవరు?"

"అడ్నొగ్గేసిన పెళ్ళాం."

"ఒగ్గేసిన పెళ్ళాన్ని సూడ్డానికా"

"పనిమాలా బేరం మానుకొని మాటికి అడ్డొచ్చినావంటే రాని దంతాలు కూడా పీకగలను... ఇందాకేటన్నానూ?

"ఒదిగున్న పెళ్ళాంకంటే ఒగ్గేసిన పెళ్ళాం అంటేనే మోజన్నావ్"

ఎందు కన్నానూ"

"ఏమో నీకే తెలియాలి"

"అఁ ఇప్పుడు గేపకం వచ్చినాది. సివంచెలం గోదు టేక్సీ ఒప్పగించి వెళ్ళిపోనాడా ఆడలా గెళ్ళాడో లేదో ఇలా దిగినారు. ఒక ముసలాడూ పడుసుగుంటానూ. మనవరాల్ని మెడికల్ కాలే జీలో జేర్చటానికి రైలు దిగాడనుకున్నాను. టాక్సీ ఎక్కి ఏదో ఒటేలు పేరు చెప్పి పోనిమ్మన్నాడు. ఒటేలు జేరీలోపుని బేక్‌సీటు బెడ్‌రూము జేసీసి నాడనుకో".

"మాఁవాఁనాకు తెలకడుగుతాను మడిసికి ఎప్పటికి పోతా దిది?"

"నా మటుకు నా కెప్పుడో పోనాదొరే. ఇంట్లో ఆడదేదుస్తాదని కాని ఎప్పుడో మానీనుండీ వాణ్ణి."

"నీలాంటి రుషుల పూసుకాదనుకో మామూలు వాళ్ళ సంగతి".

ఈ మాటే! మొన్నో పకీరు నడిగినాను. "బేటా మొగాడ్కి పిడికిడ్ ఖానా తిన్నన్నాళ్ళే ఔరత్‌కీ పిడికిడ్ బుగ్గి అయ్యా వరకు వుంటాదని మహమ్మద్ రాసినాడు" అన్నాడు.

అతని మాటలకి చుట్టూ వున్న అంతా విరగబడి నవ్వారు.

"ఈ కబుర్ల కేం కానొరే లారీలు ఎడం పక్కే ఆపినావా? లేపోతే ఈ వొరసంతో మామూలు ఐదూ, రాంగ్‌సైదు ఆపినం దుకైదూ ఇమ్మని పోలీసో డెవడో వచ్చేస్తాడు."

"ఇంత వొరసంలో ఏ పోలీసొస్తాడు మాఁవాఁ?"

"అలాగనకొరే దొంగలకీ, లంజలకీ, పోలీసోళ్ళకి వొరసం రాత్రే గిట్టుబాటు జాస్తి" లోకంలో సీమదూరని జాగా వుంటాదేటో గాని పోలీసోడు సూడని పెదేశం ఉండదనుకో. ఎనకటికి మల్నా టోళ్ళే సంతపేట సన్నాసమ్మది ఆరో మనుఁవాఁఏడో మనువా అని కొట్టుకు సచ్చినార్ట. పోలీసోడి సంగతి తరవాత చూద్దాం కాని ఆ ప్రొప్రైట్రు బాబుని బేగిపిలండి. ఆకల్నేదు గాని కడుపులో సచ్చిపోయినట్టు నల్లబడిపోనాది. కాస్త ఏడీ టీ నీళ్ళడితేగాని పళ్ళు కరుసుకు పోతున్నాయి. బాబూ, ప్రొప్రైట్రు బాబూ. కాస్త నేతి గుడ్డట్టుకురా" అని గట్టిగా పిలిచాడు.

ఆ హొటేలు పాకలో వున్న పది బల్లలచుట్టూ లారీల మను షులూ, బస్సు పాసింజెర్లు కిక్కిరిసి వున్నారు. పాక పాకంతా పొయ్యి సొగతోనూ, బీడిల పొగతోనూ ఎంత నిండిపోయిందంటే ఆ పాకలోవున్న కర్రక్కూడా కాన్సర్రావచ్చు, మసిబారిన గ్లాసు లైటుకంటే ఎర్రటి పొయ్యి వెలుగే ఎక్కువగా కనిపిస్తోంది. చూరుకింద పడుకున్న ఒక కుక్క వర్షంజల్లు తగిలి లేచి హోటలు నిండా వున్న జనాన్ని చూసి చూరుకిందే నిలబడిపోయింది.

"ఎక్కడ సంపాదించావు బాబూ ఈ జాగిలాన్ని? ఊరదైనా ఇలవైనది, దొమ్మరిసాన్ని దొరన్నట్టు?"

"నువ్వొచ్చేవా బాబూ...." ఏదో అనబోయాడు ప్రొప్రైట్రు.

"వచ్చింది నేనే నా దెయ్యం కాదు"

"నాను సూడనేదు, ఎప్పుడొచ్చినావ్?"

"సరిగ్గా ఈమాటే అందిట ఎనకటి కెవర్తో మొగుణ్ణి సూసి రంకు మొగుడి పక్కలోంచి లేస్తూ"

"నువొచ్చేవ్, ఇంక కబుర్లకి లోటుండదు"

"సరిగ్గా ఈ మాటే అందిట ఆ తరువాత అది" ఇంతకీ సెడిపోయిన దానూసు ఎందుగ్గాని మంచివి ఏడి "టీ"లు అంపించు, మాకు టీ సాలు, ఆకల్నేదు".

"ఈ వొరసం ఇంత బేగొగ్గదు, ఏదైనా తిను". సలహా ఇచ్చాడు ప్రొప్రైట్రు.

"వరసం పోవాలని మాఁవుఁ ఏడుస్తూంటే పోతే ఏడు స్తానంటావు నువ్వు ఇంత బేగి నువ్వు కదలవ్ నేను కదలను. వల్లకాట్లో అరిచ్చెంద్రుడన్నట్టు తిండి సంగతి తరువాత చూద్దాం, ముందు టీలు అంపు" అరిచేతులు రాసుకుంటూ కూర్చున్నాడు.

"మంచి కథ చెప్పు మాఁవాఁ" ఎవరో అడిగారు.

"ఎనకటికి ఎవడో మునికి ఈస్వేరుడు ప్రత్యచ్చమయి ఏటి కాలిలని అడిగితే ఆ ఎర్రిరుషి సొగరం అడక్క, అమృతం అడక్క ఏటడిగాడో తెలుసా. నావో ఇసయం తెలుసుకోవాలని వుంది. బతకడానికి ముక్యంగా ఏటి కావాలి అనడిగాడు. అప్పుడు ఈస్వేరుడు ఏటన్నాడంట "నీకులేంది మీ ఈదికుక్కకి కూడా తెలిసింది. "డబ్బు" అని ఆపిచ్చిముని అయితే ఆడబ్బేతె అని అడుగుతాడేమో అని ఎంటనే మాయమైపోయాట్ట".

"అయితే నువ్వనినది డబ్బులేనిదే బదకలేఁవంటా వేఁటి?" ధర్మసందేహం వెలిబుచ్చాడొకడు.

"బతకలేకేంరా, బతకొచ్చు, డబ్బులేకుండా నీ ఈది కుక్క మీ సాకలోడి గాడిద బతకడం లేదూ, అదిగో ఆటిల్లాగే బత కొచ్చు. కాని నీ బతుకు కూడా ఆటి బతుకుల్గాగే వుంటాది?"

"నీకి డబ్బుంటే ఏటి చేస్తావ్?"

"ఏటి సెయ్యను ఏటి చెయ్యకపోడానికే డబ్బు"

"ఏటి సెయ్యకపోడానికి డబ్బేలరా?"

"అద్గదీ, అక్కడే ఉంది. హరిదాసు చెప్పినట్టు అసలు యిసయం. డబ్బుంటే ఏటి సెయ్యక్కరలేదు. అదే సేసు కొచ్చేస్తాది అన్నాను"

"ఏటి సేస్తాదేం"?

"ఏటి సెయ్యరేం"?

"నువ్వే సూసుకో. నువ్వో పకీరుగోడివి, నెత్తిమీద రూపా యెడితే ఎవడూ పావలాకి కొనడు. నీ పక్క నెవరున్నారు? కుక్క ఎలాగున్నది? నువ్వుసస్తే నిన్ను పీక్కుతినాల న్నట్టు నీవేపే సూస్తున్నాది. నువ్వుసస్తే నీ శవాన్ని సూపి సందాలెత్తు కోవ చ్చున్నట్టు సూతున్నారు నీపక్కనున్నోళ్లు. నువు పుడితే సంతోషించి నోడెవడు? అసలెందుకు సంతోషించాలా? రాజ్జానికి రాజు పుట్టాడనా? లచ్చలకి అధికారి వుట్టాడనా? పెజకి నాయకుడు పుట్టాడనా? ఎందుకురా? ఎందుకు సంతోసించాలా? లేని పాలి వ్వలేక మీ అమ్మ ఏడిసుండాలా? పేడకుప్పలేరుకునే ఈడుచ్చే వొరకన్నా వొణ్ణం పెట్టాలని మీయయ్య ఏడుసుండాలి. కాస్త వొయసొచ్చాక తన జోబిలో బీడీలు కొట్టేస్తున్నావని మీ యన్న ఏడినుండాలి? పడుసుకుని తెచ్చిన డబ్బుతో నువ్వు తాగేస్తున్నా వని మీ యప్ప ఏడిసుండాలి. సినిమా హాలుకాడ స్టూడెంటు కుర్రాళ్ళని సూసినప్పుడల్లా నిన్నెందుకు కట్టుకున్నానని నీ పెళ్ళాం ఏడుస్తుండాలి, నువ్వు రేత్తిరి వొణ్ణంతిన్నాక నీ బీడీలకట్టకి కొట్టుకెళ్ళిన నీ కొడుకు తనీడువాళ్ళు సదువుకుంటూంటే సూచి ఏడుస్తుండాలి. నీ కూతురుకే ఈడొస్తే దాని బతుకు బజారు పాలు చెయ్యని దేవుణ్ణి, నిన్నూ తలుసుకుని ఏడుస్తుండాలి. ఇంక నువ్వుసస్తే ఏడిసేదెవ్వరూ? నీయమ్మా! నీలాటోడ్ని కన్నప్పుడు పురుట్లోనే సచ్చీసుంటాది.

నీ పెళ్ళామా? దెయ్యమై నీ మొదటి తద్దినాని కెళ్ళిచూడు ఎవడితో వుంటాదో?

నీ పిల్లలా? బతికినప్పుడు ఏవంత బణారసు చీరలూ, సిలుకు లాలిచీలు కొనిచ్చీసినావని, సచ్చినప్పుడు ఏడవడానికి ఆళ్ళు పుట్టి బుద్దెరగాక ఎప్పుడూ నవ్వెరగరు.

మరంచేత మీలాంటి బీదెదవలకి సస్తేనే ఇంత ఎక్కువ, నీ శవాన్ని సూపి సందాలెతుకోవచ్చు.

అయితే అన్నింటికి డబ్బే మూలం అంటావ్?

ఎవడో అడ్డు ప్రశ్నవేశాడు.

"నీలాటోడే బజారుముందని సూసి కుసింత సెడ్డట్టు అగు పడుతోందన్నాట్ట. ఆడూసొగ్గేకాని నానోకత సెప్తా యింటారా?"

"యిప్పుడు కతలెందుకులే మాఁవాఁ" ఒకడు మూలిగేడు.

"నాలాటిదే ఓపాలి బెమిసి బేపనాడ్ని పిలిస్తే యీపొద్దు బుదవారం బుద్దిగుండాలన్నాట్ట అదిగో అలాగుంది మీ సంగతి. నా కతలినడానికి పత్రికలోళ్ళు పరుగులెడతావుంటే, కోరి సెప్తానంటే యినవంటున్నారు కానీండి, నా దేటి పోతాది?"

ఈలోగా "టీ"లు తెచ్చాడు ప్రొప్రైటరు.

ఒక గ్లాసు తీసుకొని రుచి చూశేశాడు అతను "ఇదేటి ప్రొప్రైట్రు బాబూ 'కాపీ' నా? 'టీ'నా? కాపీ అయితే టీ ఒట్టు కురా టీ అయితే కాపీ అట్టుకురా రెండూ కాకపోతే ఏదైనా పట్రా" అన్నాడు.

"నీ కెప్పుడు పరాసికాలే" అంటూ నవ్వేడు ప్రొప్రైటరు.

"నువ్వు ఆడదానివైనా అంటాలని ఉండదు. నీతో పరాస కాలేటి నాకు"!

ప్రొప్రైటరు వెళ్ళిపోయేడు.

"ఇందాక ఆసికాని కొద్దిన్నాను, కత సెప్పుగురూ" అన్నాడు యిందాక కథ వద్దన్నవాడు.

"నీ యమ్మ నీ అయ్యని పెళ్ళి సేసుకుందిరా? మనిషన్నాక ఒక మాటమీదుండాల"

"వింటే మాత్తరం ఆడికర్దమై ఏడుస్తాదేటి? అడో గుంట ఎదవ. ఆడిమాట కేంగాని కత కానీ గురూ" అంటూ మిగతా వాళ్ళు బతిమాలేరు.

"అయితే యినండి, ఎంకటరత్నం బాబు కథ సెప్తా"

"ఆ బాబెవడు?" ఉండలేనివాడు అడిగేడు.

"తాటకి తమ్ముడు, మరిడమ్మ మొగుడు, ఇంత తొందర ఎదవపని కట్టుకున్న యీడిపెళ్లాం ఎలా ఏడుస్తోందో, కదకాదా కూడుకాదా నిదానం వుండాల్రా నిదానం. మళ్ళీ ఎర్రి మొర్రి

ప్రశ్నలేసి కద కడ్డం వచ్చినావంటే ఎంవిఁక విరిసీరి పొయిలో పెట్టేగల్ను. వల్లకుండు, ఎంతవరకూ సెప్పినానూ?" అంటూ ఆగి బీడీ అంటించేడు.

"వెంకటర్నతం బాబుండీవోడన్నావ్"

"అన్నానా, ఆ బాబు బస్సులోనే నాను మొదట క్లీనరు పని చేసింది. ఆ బాబు కారే నాను మొదట గుద్దించేసింది. ఆ బాబు నెలా మరిసిపోతాను," అంటూ ఆగి ఆరిపోతున్న బీడీని గట్టిగా పీల్చి మళ్ళీ ఆరంభించేడు.

"మనకి సొతంత్రం రాకముందెక్కడుండీవోడో తెల్దు గాని సొతంత్రం వొచ్చీ సరికి పట్నం జేరి రెండు టాక్సీలు ఎట్టేడు, ఆ బాబు ఉంచుకున్న దానిది గొప్పదన జాతకం. రెండు టాక్సీలూ రెండేళ్ళ నాటికి ఇరవై అయేయి. ఆ తర్వాత అవి బస్సులయేయి. బస్సులు లారీలయేయి. ఇయన్నీ కలిసి రెండు సినీమా హాళ్ళు అయేయి. ఆ ఊరికా బాబు సెయిర్మన్ అయి పోయినాడు. అయితే ఒక మాటొరి. సంపాయించ డానికి సెయిర్మన్ అవలేదు. ఎంత రెండు సంసారాలుంటే మాత్తరం ఆ బాబుకున్న ఆస్తి సాలదేటి? మనం ఆ బాబు పొలానికెల్తే ఆవలి గట్టు అగుపడదు. ఇంటి కెల్తే పై అంతస్తు మనక్కనపడదు. ఆ బంగళా ఎలా గుండీదేటి? అందులోకెలిన పెతివోడూ అబి మన్యుడే. మరి బైటికి రాలేడు. అందులో నేలని ఏసిన తివాసీలు సేత్తో అంటుకుంటే మాసి పోతాయి. ఒక్కోబాత్‌రూము నాలుగు బెడ్ రూములంతుంటాది. యింతెందుకూ, ఆ బాబు అత్తరు సీసా మన ఆముదం బుడ్డీ అంతుంటాది. ఆ బాబు యిచ్చే మందు పార్టీలు లెక్క వెయ్య డానికి పెత్యేకం ఓ గుమాస్తా వుండిపోతాడు. అయితే యిన్నున్నా ఆడదాని విషయంలో మాత్తరం మహా నిజాయితీ అయినవోడు ఆ గంగమ్మని ఎందుకు తీసి నాడో తెల్దు కాని ఆవిడ్ని, పెళ్ళాన్ని తప్ప మరో ఆడమనిషిని కన్నెత్తి జూసేవోడు కాదు. గంగమ్మని తెచ్చేదని పెళ్ళాంవేపు సూడ్డేదు అనుకునేవోరు! గంగకాడ యీవోరం పడుకుంటే, సీతమ్మ అంటే పెళ్ళాంకాడ కిందిటోరం పడుకున్నాడన్నమాటే. గంగమ్మకి రంగమ్మ ఒక్కతే కూతురైతే, సీతమ్మ తల్లికి అయిదుగురు రత్నా ల్లాటి కొడుకులు. పెపంచి కానికి జెడిసె ఆళ్ళిద్దర్నీ ఒకింటిలో ఎట్టలేదుగాని, ఆళ్ళిద్దరికీ ఏ కోపాలూ నేవంట. అలాగని ఆవిడింటిలో యీవిడా, యీవిడ యింటి ఆవిడా ఎప్పుడూ వుండే వోరనుకున్నావ్? ఆ బాబుతో తిరవతో మర్కేడకో ఎల్లినపుడు తప్ప కల్సుకునేవోరుకారు.

ఇన్నున్నా ఆ బాబుకొకటే యిశారం. "సదువునేదే" అని, సెయిర్మన్ అవక తప్పదని సంతకం నేరుసుకున్నాడనుకో. మరింక ఏం సేసినా సదువు రానేదు. సినీమా పేపరైనా సరే కొడుకో, కూతురో సదివి వినిపించాల్సిందే. కాని ఎలక్షన్లలో మాత్తరం... ఆడెవడూ భారతంలో కొస్తాడూ? ఆఁ శకుని అలాం టోడు మొగోడు. ఎవుడన్నా అవతల పార్టీకి ఓటిస్తే ఆడిముండ ఓట్లు ఆ బాబు లాగిసీడన్న మాటే నూటికి ఎనభై వోట్లు ఆ బాబుకే అయినా, అవతలి పార్టీ ఓటు ఒక్కటి లాగడానికి పదివేలన్నా సరే కరుసు పెడ్తాడు. వొంద పాపాలు సెయ్యమన్నా సేస్తాడుకాని ఏ మాట కామాటే సెప్పుకోవాల. ఆడదాని కాడ ఎంత నిజాయితీనో డబ్బు కాడా అంతే. ఆ ఆస్తి అంతా రావాల్సి వచ్చిందే గాని ఆ బాబు పాపాలు జేయిస్సి సంపాయించింది మాత్తరం కాదు.

'డబ్బు క్షేత్రా! ఆడది సంపాయిస్తాది," అని కొట్టిపారేసీ వోడు. ఆ బాబు యాపారం అంతా మేనీజెర్లు సూడా ల్సిందే, లెక్కలన్నా జూసేవోడుకాదు.ఆ బాబు కాడకిరాని ఆపీసరు నేడు. హైదరాబాదు నవాబు మాట కెంత యిలవో ఆ బాబు మాటకీ అంతే. కాని తన కోసరం అని ఏ అపీసర్నీ ఏదీ అడిగివోడుకాదు ఒక పాలేటైందంటే, కొత్తగా వొచ్చిన బ్రేకినసపెట్రు ఎవడో తెలీక ఆ బాబు బస్సుమీద ఓవర్లోడు కేసు పెడితే, ఆ బాబు కేసు తీసేమని సెప్పలేదు సరికదా ఆ బ్రేకినసపెట్రోని పిలిసి, ఆడి ఎదటే ఓవర్లోడు సేసిన కండక్టరుగోడ్ని కంచీతో కొట్టి తొక్కొక్కలాగేసేడు.

అయితే ఆ బాబుకి ఒకటే పిచ్చి, వవరుపిచ్చి ఎప్పుడూ ఆ బాబు గదిలో పదిమంది వుండాలి. గది అవతల మరో పది మందుండాల. "బాబూ! మాకే పంచదార కోటాఇప్పించండి" అనొ చ్చినా, "తెలక జేసినాడు మావోడు యీకూనీ కేసులో తప్పిం చండి" అనొచ్చినా ఒక్కలాగే జూసీవోడు. ఒక్కలాగే పొట్లు పడీవోడు.

అయితే ఒకట్లే. ఆ బాబు మాటకా యిలవుండేది. ఆ బాబు నోరిప్పి" "ఈన్ని ఒగ్గీయండీ" అని జెప్పకుండానే ఒగ్గీసీవోళ్ళు కూనీ కేసులో ఉన్నోడినైనా ఇనసపెట్టర్లు మరైతే ఆ బాబు మాటకి అంత యిలవ రాడానిక్కారణం సగం ఇస్సినాదం బాబు.

ఈ బాబెవడు?

సరిగ్గా యీ మాటే అన్నారట కుశలవులు రాముణ్ణి చూసి ఇస్సినాదం బాబు ఎంకటరత్నం బాబుకి ఏదో దూరం సుట్టం.

ఎంకటరతంబాబు చాకైతే యిస్సినాదం బాబు బాకు. పోలి టిక్సులో ఆ బాబు రాచ్చసుడైతే యా బాబు బెమ్మరాచ్చసుడు. ఆ బాబు పావైతే ఈ బాబు రెండతలల పాము. ఆ బాబు పులైతే ఈ బాబు సెట్టెక్కడం వచ్చిన పులి, మరంచేత యిసినాదం బాబుని సిన్నప్పుడే సేరదీశేడు ఎంకటరత్నం. సేరదీసి సదువు సెప్పించి పెళ్ళిచేసి పై సరదాలకి రంగమ్మ నుంచుకోమన్నాడు. దాంతో మరి యిస్పనాదంబాబు వెంకటరత్నం కుక్కై పోయేడంటే నమ్మండొరే" అంటూ మరో బీడీ తీసి అంటించి ఆ చీకట్లో రంగమ్మ కనిపిస్తున్నట్లు చూస్తూ వుండి పోయేడు.

ఈ కాలం గుంటలకి జెబ్బావుండదు చట్టావుండదు. అరు గజాల చీరగుడ్డిసె అందులోనే లంగా, బాడీ కుట్టేసుకుంటారు. రంగమ్మ అలా కాదు. ఏడు గజాల కోక ఒక చుట్టుకొస్తాది. నువ్వకాలంలో వున్న పుల్విని నెప్పుడన్నా జూశావా? అదిగో అలా గుండేది. పులిని జూసి సిన్న జంతువులు నిలబడి పోయినట్టు మొగాళ్ళు నిలబడిపోయి వోరు, రోడ్డుమీద ఆయమ్మ కారెక్కివస్తే సెయ్యెత్తు మనిషేమో నీలాటోడ్ని సెయ్యెత్తి కొడితే నీకు వేరే గొయ్యి తియ్యక్కర్లేదు. అలా బావిలోకి దిగిపోవాల్సిందే. జోబీలోకి పరుసు దిగిపోయినట్టు, అమెరికా పెసిడెంటుని తీసుకొచ్చి ఇండియా అంతా చూపించి నీకేటి కావాలంటే రంగమ్మ కావా లంటాడు. అదేటోగాని పొట్టివాళ్ళనీ, పొడుగువాళ్ళనీ ఒక్కలాగే ఆకట్టుకుంటాదాయమ్మ. జనమంతా నీ పెళ్ళాంతో కాపరం చేస్తావా? రంగమ్మతో ఒక రేత్తిరుంటావా అంటే జబ్బు మని షెవడన్నా పెళ్ళాంతోనే వుంటాననొచ్చు. మళ్ళీ మనిషి... రంగు ఎలాంటిది! నలుపే కాని తెల్లోడు కూడా యిలవకట్టే నలుపు. దానికో మెరుపుంది. ఆయమ్మ సైజే ఆయమ్మ అందం. ఇరవైకీ, ఎనభైకీ మధ్యనున్న ఏ మొగోడైనా ఆవిడ్ని చూస్తే యింక ఆడు ఆయమ్మకి కుక్కే ననుకో... ఇచిత్తరం ఏటంటే ముగ్గురు పిల్లల తల్లి అయినా ఆయమ్మ పిల్లల్ని కనడానికి పుట్టిన ఆడదాన్లా గుండదు.

మరింక ఆదిగా అలాంటి ఆడదాన్నిచ్చిన ఎంకటరత్నం మాట కాదని యిస్సినాదంబాబు ఎక్కడికెళ్ళగల్డు!

ఎంకటరత్నంబాబు యిస్సినాదానికి రంగమ్మ నియ్యడము ఒక ఎత్తయితే, తొలిపాలి ఎమ్మెల్యే జెయ్యడం రెండెత్తులు. ఇస్సినాదం బాబైనా తక్కువరకం గాదు, వేలుజూపిస్తే ఉంగరం మింగేసేరకం తొలిపాలి ఎమ్మెల్యే అయేడో లేదో మలిపాలి మినిస్ట్రు అయిపోయినాడు. ఆ తరువాత ఐదరాబాదులో ఆ బాబెలా గుండేవాడో నాకు తెల్డుకాని ఇక్కడ ఎంకటరత్నంబాబు మాత్తరం రాజుగారి మావలా గెలిగిపోనాడు. మళ్ళీ పెళ్ళీడు కొచ్చినట్టు అయిపోనాడు. ఆ రోజుల్లో అతనిల్లు చూస్తే ఇది ఇల్లా! మునుసబు కొరటా అనిపించీది. వొచ్చీవోళ్ళూ, పోయీ వాళ్ళు, ఆ జనాన్ని చూస్తే ఇంటిముందు ఓ హోటేలో బీడీల బడ్డీవో పెట్టాలనిపించేది.

"మా అబ్బాయికి ఉద్యోగం... నా సెల్లలు మొగుడ్నొగ్లే సింది .... బియ్యం లారీలు ముందు యినాసపెట్రు తరువాత కమరి షెల్ టేక్సోళ్ళు పట్టేసుకున్నారు-మీకు వోట్లిచ్చినావని అన్యా యంగా రైటింగ్ కేసెట్టినారు-ఈ ఒక్కపాలికి తప్పించేరంటే మళ్ళా మావోళ్ళ కూనీసెయ్యరు-తెల్లారి నెగిస్తే యిలా గడిగీ వోళ్ళు లచ్చా తొంబయి మంది. ఎవుడొచ్చినా కాదన్లేదాబాబు. తన సేతుల మీద పెజల సొమ్ము ఏలకి ఏలూ ఎల్లేది.

మరంతే. అంతవరకూ డబ్బుకాదున్న నీతి ఒగ్గేసి వాడు. తరువాత యినాసపెట్రు బాబుకి వంద వసూలు చేస్తే తనకోసం వెయ్యి వసూలు చేసేవోడే. అదివొరకు మొహమాటానికి చేసే ఆఫీసరు యిప్పుడు డబ్బు పడి నీతి పూర్తిగా ఒగ్గేసేరు. అదివొరకు తెల్లోడి బావుటా ఎలా గెగిరీదో యిప్పుడలా ఎగురుతోంది. ఆ బావుటా, ఆ బాబులేని సబలేదు, సరదాలేదు. మినిస్ట్రు మీటింగు లోనూ ఆ బాబే, మేష్టర్ల మీటింగులోనూ ఆ బాబే, సినిమావోళ్ళ కమిటీలోనూ ఆ బాబే, సర్కసోళ్ళ సంగంలోనూ ఆ బాబే.

మడిసి పాండురోగం వచ్చినట్టు తెల్లబడిపోనాడు తనివికి.

ఇదిగో యీకత యిలాంగుండగా ఆ జిల్లాకి ఓ సారి గాలివానొచ్చింది. నడివేసంగిలో, ఏసంగిలో ఏళ్ళు (నదులు) ముంచేస్తాయని బెమ్మంగోరు రాశేరట. వొర సానికి ఆకాశం బావికి అంటుకుపోయిందనుకో. సావని పశువేదన్నా వుంటే పడిపోని యిల్లుందేమోనని చూసి అందులో కట్టేసినోరు. సలికి వణకలేక గొర్రెలన్నీ సచ్చేయి. యీ యింటినీ, ఆ సెట్టునీ పట్టుకొని వుండిపోయినారు పెజ!

ఆ తరువాత గవర్నమెంటు కోట్లు కరుసుపెట్టింది. ఆ కోట్లు పెజకాడే వొసూలు సెయ్యమని ఐదరాబాదులో వేసిన ఆర్డరు కలకటేరుకు ఎంటనే వొచ్చీసినాది. దాంతో తాసిల్దార్లూ, పోలీ సోళ్ళూ ఊరిమీద పడ్డారు.

వొరదొచ్చి పెజ సస్తావుంటే ఆళ్ళకి సాయం చెయ్యడానికి

ఆళ్ళనే ఆడగడవేవిటి నాయం? ఎవరో సందేహవెలిబుచ్చేరు.

“అదిగక్కడే వుంది కీలకం. మామూలప్పుడు ఆరపైస లగ్గిపెట్టె పది పైసలకూ, రెండు రూపాయల పంచదార నాల్రూ పాయాలకూ, అమ్మి లచ్చలు కొట్టేస్తారు. ఈళ్ళిలా కొట్టేస్తుంటే గవుర్నమెంటూరుకున్నందుకు, వరదొస్తే చందా, వాన రాకపోతే ఒక చందా, ఎలక్సనొస్తే ఒక చందా పారేస్తారు. ఇదిగిక్కడే వుంది మోసం. ఆల్లు సందాలివ్వక పోతే సచ్చిపోయుండే వోళ్ళ మని మనం ఆళ్ళు ఎవరళ కెయ్యమంటే ఆళ్ళకి ఓట్లు పడేస్తాం. మొన్న పార్కులో ఆడెవడో చెన్నాపట్నం నుంచి వచ్చినాట్ట. వొచ్చి మీటింగెట్టి ఏటడిగాడంటే “మనల్ని ఏటి పాలిస్తుంది” అన్నాడు “కాగితం అన్నారు పెజ.” ఏ కాగితం? అన్నాడు మళ్ళీ ఓటు కాయితం అన్నారు పెజ. కాయితం అన్నమాట నిజమే కాని ఓటు కాగితం కాదు. తుపాకి గుండుచుట్టన్న కాగితం అన్నాడు. ఎర్రిమొర్రి పెశ్నలేసి నా కత మరపించీసినారు సీతమ్మతో హను మంతుడన్నట్టు. ఎంతవరకు సెప్పినానూ?

“చందాలవరకూ”

“అవునా, మరైతే యిను, యీ చందాలు ఎలా వసూలు చేస్తారంటే–కలకటేరు కూకుంటాడు. ఆ బాబూ చుట్టూ మిగతా ఆఫీసర్లు అంటే సూపర్నెంటూ, చెక్ పోష్టోళ్ళు, ప్రొహిబిషనోళ్ళూ అంతా కూకుంటారు. అప్పుడు కలకటేరుబాబు ఆళ్ళందర్నీ చూసి ఓ నవ్వునవ్వి, మన జిల్లాకి వొరదవల్ల యింతనష్టం వచ్చి నాది. మనం యింతైనా వసూలు సెయ్యాలంటాడు. “ఔనాను” అంటారు మిగతా వాళ్ళు. అంతే, మిగతా ఆఫీసర్లు యిళ్ళకెళ్ళి పోయీ ముందు సీటీ యిస్తారు. ఆ సీటీల్లో వుంటాయి ఆళ్ళు వసూలు సెయ్యాల్సిన మొత్తాలు. ఆళ్ళు ఎలా వొసూలు సేత్తా రంటే మాటొరసకి సూపరెంటు బాబే ఒక లక్ష వొసూలు సెయ్యా లనుకో. ఆ బాబేటీ సెయ్యడు. ఆ బాబు కిందున్న డియస్పీ బాబుతో సెప్తాడు. ఆ బాబులు యినసపెట్టర్లమీద పెడతారు.

మజ్జెలో ఎవడూ కొట్టీడేటి?

గవర్నమెంటు సొమ్మంటే లంజమానం లాంటిది. అందరికీ లోకువే ఆకరికి రావణాసురుడిలాటోడే కొట్టేశేడు.

ఒకనాడేటైెందంటే ఎంకటరత్నం బాబుకాడికి యినాస పెట్రుబాబు, తాసిల్దారుబాబు వొచ్చినారు. గొప్పోళ్ళ సంగతి నీకు తెల్దుకామోసు. వొచ్చినాడు గొప్పోడైతే ఎందుకొచ్చేది సెప్పడు, మనం అడిగేవరకు. ఆ బాబులు వొచ్చి మా బాబుతో ఐదరాబాదు యిసయాలడిగేరు. ఢిల్లీ యివరాలడిగేరు. ఆఖర్న మా బాబు ఆడిగితే రామారావు బాబు సందా యివ్వడానికి ఏడిపిస్తున్నాడు అన్నాడు. ఆ బాబు పేరుమీద ఏసినవి ముష్టి పాతికవేలు, కిందటేడు వోనల్లేవని పాతికవేలట్టు కెళ్లేరు. యీ ఏడు వొరదొచ్చిం దని పాతిక వేలడుగుతున్నారు. వొచ్చీఏడు ఎలక్ష నొచిం దటూ ఎంకటరత్తం బాబు ఎలాగొ పాతికవేలు పితుకు తాడు. ఏటా పాతిక వేలు మీ మొహాన్ని గుమ్మరించ డానికి నేనేం యాపరస్తుడి ననుకుంటున్నారా? నోట్లు మిషనున్న దనుకుంటున్నారా మీ కిష్టమైతే అయిదువేలిస్తాను దణ్ణంపెట్టి ఒట్టుకెళ్ళండి లేపోతే దణ్ణంపెడతీను, ఎల్లిపొండి” అనేసెడు అని ఫిర్యాదు చేశారు. అంతేకాదు, రామారావు బాబుగాని సందా ఎగ్గొడితే ఊరంతా ఎగ్గొడతారని హామీ యిచ్చేరు.

“రామారావు బాబెవరు?”

ఎవరంటావా మునిసిపల్ మెంబరు కాదు కాని ఎంకటరత్తం బాబుకి రెండు బుజాలూ అతనే. ఎలక్షన్లలో మదుపెట్టడం కాడ్నించి, ఎంకటరత్తం పేరు సెప్పి పెజెల్ని జడిపించి ఓటు ఏయించడం వొరకూ చూసుకుండే పదిమందిలో రామారావు బాబకడు. అయితే అలా సేసినందుకా బాబు కేటి లాబం అనేవ్. యజమాని పాలకోసం పొర్లదు ఆవు. ఆ బాబులాబం ఆ బాబు కుంటాది. ఆ బాబు మొదట్లో పెద్ద బంగారం సాపు ఎట్టేడు. ఇడ్లికి చెట్నిలాగ బంగారానికి బట్టలుతోడు. అంచేత పక్కనే పెద్ద బట్టలకొట్టెట్టేడు. సెంటర్లో రెండు షాపులు ఊరికే ఎందుకుపోవాలని ఆటి మీద ఆరంతస్తుల హొటేలు కట్టేడు. షాపులెట్టి, హొటెలెట్టి సుడిగాలిలా పెరిగిపోనాడు. ఊరంతా ఏటనుకుండీ వోరంటేబొంబాయి నుంచి దొంగ బంగారం తెచ్చే హోల్‌సేల్ యాపారం రామారావు బాబుదేనని ఎప్పుడూ ఎంక టర్తం బాబుకాడుంటాడు కాబట్టి ఆబాబుకేం పరవాలేదు. తాసి ల్దారుకీ యినస పెట్రుకీ తెలీని యిసయం ఏమంటే అప్పటి కప్పుడే రామారావుబాబు ఎదుటి పారిటీలో కలిసిపోతున్నాడే మోనని ఎంకటరత్తం బాబుకున్న అనుమానం.

“సరే మీరెల్లండి, మళ్ళీ మద్దేనం అగపడండి” అని ఆళ్ళని ఆపించీసి అలా పడక్కుర్చీలో వచ్చినోడిలా ఒక అరగంట ఉండిపోనాడు. ఆ తరవాత ఏటి సేసినాడంటే “నాన్నా” అని సిన్న కొడుకుని పిలిచి “నువ్వు బట్టలు కొనుక్కుంటానన్నావ్?”

అన్నాడు, అన్నానన్నాడు కొడుకు "ఎంత కావాలేటి?" అన్నాడు కొడుకుని.

"రెండు వేల"న్నాడు కొడుకు.

"బట్టల కేన్రా రెండు వేలు. బలాదూర్‌రా తిరగటానికి అవేటి సరిపోతాయి. ఆళ్ళేటి సైనుగుడ్డలూ, సీటీగుడ్డలూ కట్టుకుంటా రనుకుంటావేటి? మాట కద్దురాక. "ఎయ్యిస్తాను తీసుకో? నీ కిష్టంవచ్చినకాడ కొనుక్కో కాని ఆ రామారావు కొట్టుపాతబాకీ ఇదిగో ఈ అయిదువేలూ కట్టి" అంటూ యినప్పెట్టెలోంచి అన్నీ వొందరూపాయిలకాయితాలు తీసిచ్చేడు.

మద్దేనం వొచ్చినారు యినసపెట్రూ, తాసిల్దారూనూ. ఆళ్ళతో ఆ మాటా యీ మాటా సెప్పి ఆ రామారావు గోడికి దొంగనోట్ల యాపోరం వుందేమోనని అనుమానం. ఆడి బట్టలసాపు చెక్ చెయ్యండి. కాని తొందరపడి ఆడికి బేడీలేసి తీసుకుపోవద్దు" అని ఆళ్ళని అంపించేశేడు. ఆళ్లెళ్ళిన ఆరగంటకి ఎవికెమికా యిరిగి పోయీటట్లు ఏడుస్తూ కారు దిగింది రామారావుబాబు పెళ్లాం.

"కదంతా సెప్పి బేడీలేసినారు బాబూ. నువ్వే కాపాడాల" అని ఎంకటరత్తం బాబు కాళ్ళమీద పడిపోనాది.

ఆదికి ముందే కాపాడతానన్లేదు ఎంకటరత్తం బాబు "ఇంత డబ్బుండి యీ ఎదవ దొంగనోట్ల యాపారం ఎందుకెట్టేడు? ఆశకి అద్దుండాలి. పాపానికి శిచ్చుండాలి. నాను రానన్నాడు.

"నువ్వు రాకపోతే నాన్నూతిలో పడిపోతానంది ఆ యమ్మ.

"జైలు నుంచి ఒచ్చేక ఆడు పడతాడు కానీ ఎదవ యాపారాలు ఎట్టీవోడు ఎదవ చందాలు కట్టడానికి ఏడు పెందుకు" అంటూ ఎంతమందికో ఫోన్లు చేసి కారెక్కేడు. "నానొచ్చీ వొరకూ నువ్విక్కడే వుండు" అని రామారావు పెళ్ళంతో అని.

మళ్ళీ ఇంటికొచ్చేటప్పుడు రామారావునీ, లచ్చ రూపాయల్ని ఎంటబెట్టుకొచ్చేడు.

లచ్చ దేనికనుకుంటా రేటో గాలివోన సందా కేసుకు ముందు పాతిక వేలైతే పట్టుకున్నాక యబై అన్నాడు. బేడీ లెయ్యకుండా ఉండడానికి ఐదు వేలూ, పోలీస్ టేశన్‌కి నడి పించకుండా ఉండడానికి ఐదు వేలూ అన్నాడు. కేడు పెట్టుకున్నందుకు ఐదు వేలూ, సిల్లర కరుచులకి మరో పదీ అన్నాడు. ఇదిగో నీ మిగిలిన పాతిక నువ్వు తీసుకో" అని రామారావుకి ఇచ్చేసేడు. ఆ తర్వాత పోలీసోళ్ళ సొమ్ములో సగం ఆళ్ళకి పారీసేడు. గాలివోన సందా పాతిక వేలూ కట్టీసేడు. "ఇది వసూలు జేసేసరికి తలప్రాణం తోక్కి రాలేదు పూర్తిగా పోయిందంటూ.

"నాకు తెలకడుగుతాను. రామారావు కొట్లో దొరికిన దొంగనోట్లు ఎంకటరత్నం బాబు పంపినవేనంటావేఁటి?"

"లేదు, అసలు నోట్లు పెట్టిన పిల్లలంటాను. బుర్రుంటే సాలదురా, అందులో బుద్ధుండాలి. లేకపోతే ఏటా ఎదవ పెశ్న"

"ఆ బాబు కాడ దొంగ బంగారం ఉంది కదా. నోట్లు బణాయించడం దేనికీ అంట?".

"దొంగ బంగారం ఎక్కడు పాతేసాడో ఎంకటరత్నానికి తెలియొద్దా అంట."

"హమ్మ లంజికొడుకెంత పన్జేసేడు. కదన్నా కదకాదు గురూ, యమకద"

"కద ఎప్పుడువుద్దో తెలీని లంజికొడుకు కద ఇనడం ఎందుకూ అంట. అప్పుడే అయిపోయిందనుకున్నావేటి? ఎంకటరత్నం బాబే తెలివైనోడనుకున్నావ్ కాబోలు ఆడి బాబు తెలివి రామారావు కుంది. మరి ఆ వేళ నుంచీ ఆర్నెల్లు తిరిగీ వొరకూ ఆ బాబు అంటే ఎవరనుకున్నావ్–రామారావు బాబు తన దొంగ నోట్ల యాపారం తగ్గించేసుకున్నాడు."

**(1975)**

# డబ్బు - 2

**దా**రి మధ్యలో అంత వానవస్తుందని మేము కలలో కూడా అనుకోలేదు. ఇంకో గంటవరకు వాన రాకపోయి వుంటే హాయిగా విశాఖపట్నం చేరిపోయే వాళ్ళం. రోడ్డు మీద కారు ఎగిరి పోతుందేమోనన్నంత తీవ్రంగా వీస్తోంది గాలి. అయినా మొండిగా కొంతసేపు కారు పోనిచ్చేం. కారు ముందున్న అద్దాలు కరిగిపోతున్న మంచు పలకల్లా ఉన్నాయి. కారు లైట్లు వెల్తురులో వర్షపు చినుకులు వెండి మేకుల్లా ఉన్నాయి.

ఒకచోట కారు ఆపక తప్పిందికాదు ముందు ఆగివున్న లారీలు బస్సులూ చూసి ఆ లారీలకు ముందు రోడ్డుకి అడ్డంగా పెద్ద చెట్టు పడిపోయిందట. అంచేత ముందుకి వెళ్ళలేం. కారు